# బీసీ బిల్లుకు అన్నిపార్టీలు మద్దతివ్వాలి



రాలీ పాల్గొన్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

ప్రధానమంత్రి మోడీకి లక్ష పోస్ట్‌కార్డులను పంపుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం కల్పించిన రిజర్వేషన్లకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించి, చట్టబద్ధత కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ మహాసభ ఆధ్వర్యంలో పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అన్ని రాజకీయపార్టీలు మద్దతివ్వాలని కోరుతూ.. బుధవారం రాష్ట్ర నాయకులతో రాజేందర్‌పటేల్ గౌడ్ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీసీల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, అందుకు బీసీలు సంఘటితమై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. బీసీల హక్కుల కోసం ప్రతి బీసీ బిడ్డ కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడినప్పుడే విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్, భూషణ్ భాస్కర్, ప్రదీప్ గౌడ్, పి.కృష్ణ, ముత్యాలరావు, రాజేశ్ జస్వాల్ ర్యాలీలో పాల్గొన్నారు.

### ప్రధాని మోడీకి లక్ష పోస్టుకార్డులు

బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వని పార్టీని భూస్థాపితం చేస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలపై కేంద్రం చిన్నచూపు చూస్తుందని, ఇలాగే ప్రవర్తిస్తే దేశవ్యాప్త బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. బీసీల సంక్షేమపై చిత్తశుద్ధి ఉందని చెబుతున్న బీజేపీ అందుకు పార్లమెంట్లో బిల్లును ప్రవేశపెట్టి ప్రధాని మంత్రి నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే అసమానతలు లేని సమాజ నిర్మాణం జరగాలని ఆయన పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు అమలు అయితేనే అది సాధ్యమవుతుంద న్నారు. కార్యక్రమంలో బీసీ దళ్ నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను వార్డ్ ఆఫీస్‌లో అందజేయాలి

మారుతీ దివాకర్ డీసీ

అంబర్‌పేట : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను ఆయా డివిజన్లలోని వార్డు కార్యాలయాల్లో అందజేయాలని అంబర్‌పేట డీసీ మారుతీ దివాకర్ తెలిపారు. ఏప్రిల్ 14 చివరి తేదీ కాగా, మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసినప్పటి రసీదు, జిరాక్స్ పత్రాలను ఇవ్వాలన్నారు. కాచిగూడ డివిజన్‌కు సంబంధించి విక్రంనగర్ పార్కు వద్ద వార్డు కార్యాలయం, నల్లకుంట డివిజన్‌కు సంబంధించి తిలక్‌నగర్ హాస్పిటల్ వెనుక ఉన్న కార్యాలయం, గోల్నాక డివిజన్‌కు నెహ్రూనగర్‌లోని కార్యాలయం, అంబర్‌పేటకు సంబంధించి పటేల్‌నగర్‌లోని కార్యాలయం, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు సంబంధించి బతుకమ్మకుంట పార్కు వద్ద వార్డు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

## అమెరికాలో సంగీత కచేరికి మాళవిక ఆనంద్

కాచిగూడ, ఏప్రిల్ 2: సంగీతంలో ప్రపంచ రికార్డు సాధించిన కాచిగూడ బర్కత్‌పుర చెందిన యువ గాయని కుమారి మాళవిక ఆనంద్‌కు అ మెరికాలోని న్యూజెర్సీలో నిర్వ హిం చనున్న సంగీత కార్యక్రమానికి ఆహ్వా నం లభించింది. తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసై టీ ఆధ్వర్యంలో 12వ తేదీన నిర్వ హించనున్న ఉగాది వేడుకలకు మాళవిక ఆనంద్‌చే భారతదేశ భక్తి సం గీత కచేరి, సంగీత కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు సొసైటీ నిర్వాహకుడు మధు తెలిపారు. సంగీత కచేరికి రెండుసార్లు మాళవిక వెళ్లారని నిర్వాహకులు తెలిపారు.

## సినీ ప్రముఖుల పేరిట ఉగాది పురస్కారాలు

పురస్కారాలను బహూకరిస్తున్న వైస్ చాన్స్‌లర్ డా.వెలుదండ నిత్యానందరావు

రవీంద్రభారతి : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సహకారంతో యువ కళావాహిని నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో విశ్వావసు – ఉగాది వేడుకలు సినీ ప్రముఖుల పేరిట ఉగాది పురస్కారాల బహుకరణ నిర్వహించారు. వక్తలుగా తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.వెలుదండ నిత్యానందరావు, సారిపల్లి కొండలరావు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేశారు. సినీ ప్రముఖల పేరిట ఉగాది పురస్కారాలు బహుకరించారు. సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం, రచయిత డా.వి.వి రామారావు, డా.పి రాజేంద్రకుమార్, ఆకెళ్ల శివప్రసాద్, ఎస్.వి. రామారావు పురస్కారాలు అందుకున్నారు. వెలుదండ నిత్యానందరావు మా ట్లాడుతూ.. విశ్వావసు ఉగాది సినీ ప్రముఖు ల పేరిట ప్రముఖులకు పురస్కారాలు బహుకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లం క లక్ష్మీనారాయణ పాల్గొన్నా రు. సభకు ముందు అలనాటి ఆణిముత్యాలు సినీ సంగీత విభావరిలో గీతాలు ఆకట్టుకున్నాయి.

## సట్ట కేంద్రంపై.. పోలీసుల దాడులు

చార్మినార్, ఏప్రిల్ 2: ఆన్‌లైన్ ద్వారా అంతర్రాష్ట్ర సట్ట నిర్వహిస్తున్న ముఠా సభ్యులపై తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు అదనపు డీసీపీ అందే శ్రీనివాస రావు తెలిపారు. డీసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన పెనుగొండ సదాశివుడు, చిలకలగూడకు వలస వచ్చి ఉంటున్నాడు. అతని తోపాటు మాదిశెట్టి యాదగిరి, ఏలూరు కార్తీక్, ఫైజన్‌ఖాన్ , చందర్‌గౌడ్, మహారాష్ట్రకు చెందిన యావత్మల్లు, రాజేందర్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రాజేందర్ మూడేండ్ల క్రితం చిలకలగూడకు చేరుకొని అద్దెకు ఉంటున్నాడు. అక్కడే ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లను సమకూర్చుకున్నాడు. అతని బంధువులైన సదాశివుడు, యాదగిరి, కార్తీక్‌లతోపాటుగా ఫైజాన్ ఖాన్, తాళ్లపల్లి పున్నం చందర్‌గౌడ్‌తో సహా ఇతరులను నెలవారి జీతాలు అందిస్తానని పనిలో పెట్టుకున్నాడు. నిందితులు వాట్సాప్ ద్వారా మొబైల్ ఫోన్లు, టాబ్లెట్‌ల ద్వారా సత్తా పందాలను అంగీకరించారు. స్వీకరిస్తూ ఫంటింగ్‌లను ఆన్‌లైన్ ద్వారా వసూళ్లు చేసేవారు. నిందితులు తమకు తెలిసిన వారి ద్వారా బెట్టింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పెట్టించేవారు. అలా వచ్చిన పెట్టుబడులను మహారాష్ట్ర లోని ప్రధాన సట్ట నిర్వాహకులకు అందించేవారు. నిందితుల ద్వారా నష్టం కలిగిన పలువురు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. విశ్వాసనీయ సమాచారం అందుకున్న తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చిలకలగూడ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రధాన నిందితులు రాజేంద్రర్ తోపాటు యావత్మల్లు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి రూ. 4 లక్షల విలువైన లాప్ టాప్‌లతోపాటు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం చిలకల గూడ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

## గాంధీ నికేతన్ గ్రౌండ్ సందర్శన

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

చార్మినార్, ఏప్రిల్ 2: ' ఆటల స్థలంలో.. చెత్త కుప్పలు ' శీర్షికన నమస్తే తెలంగాణాలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం గాంధీ నికేతన్ గ్రౌండ్ ను సందర్శించారు. గ్రౌండ్‌లో నిరూపయోగంగా పడివున్న బోర్‌ను తనిఖీ చేసి వినియోగంలోకి తీసుకురావడానికి కృషి చేశారు. అనంతరం ఏఈ తేజోవత్ మాట్లాడుతూ.. గ్రౌండ్‌లో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవన నిర్మాణ పనులు వచ్చే వారం ప్రారంభం కానున్నాయని తెలిపారు.

## నూతన ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాచిగూడ : గోల్నాక డివిజన్‌లోని సంజయ్‌గాంధీ నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లస్థానంలో నూతన ఇండ్లను నిర్మించాలని బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు బాల్కనీ కూలింది. ఇంట్లో ఉన్న వ్యక్తులకు ఏమీ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సంజయ్ గాంధీ నగర్ లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ 30 ఏండ్ల క్రితం ఇండ్లను నిర్మించారు. అప్పటినుంచి ఇండ్లకు మరమ్మతులు లేకపోవడంతో అందులో నివసించే ప్రజలు ప్రతిరోజు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. గతంలో అనేకసార్లు స్లాపులు కోల్పోయిన ఘటనలున్నాయి. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నేరేత్తిన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం స్లాబ్ కూలిన ఘటన స్థలానికి హిమాయత్‌నగర్ ఎమ్మార్వో, బీజేపీ నాయకుడు కన్నె రమేశ్ యాదవ్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సంజయ్‌గాంధీ నగర్ లో ఉంటున్న ప్రజలకు కొత్త ఇండ్లు నిర్మించి ఇవ్వాలని శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభం

శ్రీరమణ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అంబేద్కర్‌నగర్ బస్తీ అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట : శ్రీరమణ చౌరస్తాలో నూతనంగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ చిన్న విగ్రహం ఉండగా.. ఫ్లైఓవర్ నిర్మాణంతో రోడ్డుకు మధ్యలో కనిపించకుండా ఉంటోంది. దాంతో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంబేద్కర్ నగర్ బస్తీవాసులు నిర్ణయించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు సహకారం అందించారు. నిర్మాణ పనులు జరుగుతుండడంతో అధికారులతో మాట్లాడి విగ్రహం ఎక్కడ పెట్టాలనేది నిర్ణయం తీసుకొని పనులు మొదలుపెట్టారు. పంజాగుట్టలో ఏర్పాటు చేయడానికి తీసుకువచ్చిన విగ్రహాన్ని ఇక్కడ పెట్టడానికి నిశ్చయించారు. పనులు పూర్తయ్యాక ప్రారంభోత్సవం చేయనున్నారు. పనులను టీపీసీసీ కార్యదర్శి శుంభుల శ్రీకాంత్‌గౌడ్, అంబేద్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటం అనిల్‌కుమార్, కన్వీనర్ ఆర్.బాల్‌రాజు, కుంకుమ నరేందర్, కుంకుమ బలరాం, కె. శివకుమార్, సభ్యులు కూరన్న కిషన్, పి. అశోక్‌కుమార్, ఎస్.ప్రేంకుమార్, రావుల ప్రదీప్, సుంకం మన్మోహన్, కుంకుమ శ్రీకాంత్, సుంకం క్రాంతికుమార్, ఏడెల్లి రాకేశ్, కుంకుమ మనీష్, ఎన్.శ్రీహరి పాల్గొన్నారు.

## సంప్రదాయ కళ లను ఆదరించాలి

కాచిగూడ, ఏప్రిల్ 2 : సంప్రదాయ కళలను ఆదరించాలని సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళ కృష్ణ అన్నారు. ఉగాది వారోత్సవాల్లో భాగంగా సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలకు ఆ యన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులకు గుర్తింపు ఇచ్చాడని పేర్కొన్నారు. నాట్యం, సంగీతానికి తెలుగు రాష్ట్రాలో ఆదరణ ఉందని, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కళాకారులను ప్రోత్సహించినప్పుడే కళలు విరజిల్లుతాయని ఆయన పేర్కొన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.

మెహదీపట్నం : ఎంఐఎం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు. ఎంఐఎం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

## కాలేజీ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీకృష్ణ, బాధితుడు నాగరాజు

రవీంద్రభారతి, ఏప్రిల్ 2 : దళిత ఉద్యోగిపైన అక్రమ కేసులు పెట్టిన శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ, బాధితుడు రెబ్బ నాగరాజుతో కలిసి ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం సమర్పించారు. డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ.. మాల కులానికి చెందిన రెబ్బ నాగరాజు ప్రిన్సిపాల్‌గా గతంలో కూకట్‌పల్లిలోని శ్రీచైతన్య కాలేజీలో కేపీహెచ్‌బీవాగ్దేవి భవన్‌లో పనిచేసేవాడని తెలిపారు. ఏజీఎం జి.రవికుమార్, డీన్ డి.శంకర్‌రావు కలిసి సహచర ఉద్యోగుల ముందే కులం పేరుతో దూషించి ఆ బ్రాంచ్ నుంచి నాగరాజును తొలగించారు. నాగరాజుపై ఆ కాలేజీ మహిళా వైస్ ప్రిన్సిపాల్‌తో తప్పుడు కేసు పెట్టించారని డా.పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. నాగరాజు సదరు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కూకట్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారని, ఇద్దరు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది..కానీ అందులో నుంచి ఏజీఎం జి.రవికుమార్ పేరు చార్జ్‌షీట్‌లో లేదన్నారు. బాధితుడు నాగరాజు మీద ఆ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ చేత కేసులు పెట్టి నేటికి వేదిస్తున్నారని బాధితుడు నాగరాజు తనను కాపాడాలని చైర్మన్ దగ్గర వాపోయాడు.ఈ విషయంపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు చార్జ్‌షీట్‌లో ప్రధాన నిందితుడిని తప్పించకుండా చర్యలు తీసుకొని నాగరాజుకు న్యాయం చేయాలని పబ్బతి శ్రీనివాస్ ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు విజ్ఞప్తి చేశారు. కొందరు పోలీసు అధికారులు కూడా దోషులపైపు ఉండి బాధితుడు నాగరాజుకు అన్యాయం చేయడానికి పూనుకున్నారన్నారు. నాగరాజు కుటుంబానికి హానీ జరిగినా శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. నాగరాజుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని శ్రీకృష్ణ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాచిగూడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన మందుబాబులపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తెలంగాణ యువతి మండలి సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మంది ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని నడిపి, క్షేమంగా ఇంటికి వెళ్లాలని సూచించారు. తాగుడుకు బానిసై తమ ప్రాణాలను పోగొట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## యాసిడ్ తాగి వృద్ధుడు మృతి..

మతిస్థిమితం లేని వృద్ధుడు యాసిడ్ తాగి మృతి చెందిన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం..నెహ్రూనగర్‌కు చెందిన షేక్ బడేసాహెబ్ కుమారుడు షేక్ ఫక్రుద్దీన్ (80) మతిస్థిమితం సరిగ్గా లేదు. మంగళవారం రాత్రి ఇంట్లో యాసిడ్ తాగాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు ఫక్రుద్దీన్‌ను మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా దవాఖానలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రీ సీతారామ కల్యాణానికి ఆహ్వానం

ఆహ్వాన పత్రం అందజేస్తున్న భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు

అబిడ్స్, మెహిదీపట్నం : సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. మహోత్సవానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను నిర్వాహకులు ఆహ్వానించారు. భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. 300 ఏండ్ల చరిత్ర ఉన్న సీతారామ మందిరంలో ప్రతి సంవత్సరం వైభవంగా కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారు. సభ్యులందరినీ పేరుపేరునా పరిచయం చేసుకొని అభినందించారు. భాగ్యనగర్ శ్రీ రామనవమి ఉత్సవ అధ్యక్షులు డాక్టర్ భగవంతు రావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాటి, ఉపాధ్యక్షులు మెట్టు వైకుంఠం, కోశాధికారి శ్రీరామ్ వ్యాస్, సభ్యులు రామరాజు, విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

అబిడ్స్ : అఖిలభారత ఆర్యవైశ్య మహాసభ కో – కన్వీనర్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సన్మానించారు. రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కోలేటి దామోదర్ గుప్త మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. రాష్ట్ర పాలన విషయంలో తీసుకున్న చర్యలపై ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతో తెలంగాణ పునీతమైంది

కార్యక్రమంలో పాల్గొన్న కంచె ఐలయ్య, పాశం యాదగిరి, సుద్దాల అశోక్ తేజ

జియాగూడ, ఏప్రిల్ 2 : వీరనారి చాకలి ఐలమ్మ పేరు మహిళ విశ్వవిద్యాలయానికి పెట్టడంతో తెలంగాణ పునీతం అయిందని ప్రొ. కంచె ఐలయ్య అన్నారు. బుధవారం రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఆర్ బ్ల్యూహెచ్ఐ) ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని దర్బారు హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి, వీరనారి చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను ఆంగ్ల పద్య రూపంలో చిత్రీకరించిన ఫొటోను ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి పార్లమెంట్ లో 50 శాతం మహిళ సభ్యులు ఉన్నపుడే మహిళ సాధికారత సాధ్యమ న్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ... విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయం అని దీనికి తొలి వైస్ చాన్స్‌లర్‌గా తాను ఉండటం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర సుపాట రూపంలో తన గాత్రం తో అలరించారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ ముని మనవరాలు శ్వేత ఐలమ్మ, డాక్టర్ సంధ్యా విప్లవ్, శ్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ పూర్ణిమ దుర్గా, డాక్టర్ పి .హరికాంత్, విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు, ఐలమ్మ కుటుంబ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అబిడ్స్ : శ్రీరామనవమి రథయాత్రకు సిద్ధమైన రాముని విగ్రహాన్ని పరిశీలిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

## దోమల నివారణకు చర్యలు

మెహిదీపట్నం, ఏప్రిల్ 2 : ప్రజలకు దోమలతో ఇబ్బందులు లేకుండా చేయడానికి జీహెచ్ఎంసీ సర్కిల్ –12 ఎంటామాలజీ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి లో బుధవారం ఇంటింటికి వెళ్లి రసాయనాలను పిచికారీ చేయించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి రసాయనాలను పిచికారీ చేశారు. ప్రజలకు దోమల వల్ల ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్ – 12 డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు.